నమస్తే తెలంగాణ
సూర్యాపేట
3 | నల్లగొండ, శనివారం 17 ఫిబ్రవరి 2024 | SURYAPET

స్వర్ణ రథంపై స్వామివారి ఊరేగింపు

గుట్టలో వైభవంగా రథసప్తమి వేడుకలు

- ఉదయం సూర్యప్రభ, సాయంత్రం స్వర్ణ రథంపై స్వామివారి దర్శనం
- పూర్వగిరిలో కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య క్షేత్రంలో రథ సప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం స్వామివారిని అలంకరించి సూర్యప్రభ వాహనంపై వేంచేపు చేశారు. ఆలయ పశ్చిమ రాజ గోపురం గుండా మాఢవీధుల్లో అరుణపారాయ ణాలు పఠిస్తూ సేవను ఊరేగించారు. తూర్పు రాజ గోపురం వద్ద సేవను వేంచేపు చేసి స్వామివారి వైభవం, పుట్ట పుర్వోత్తరాలు, అలయ చరిత్రను ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌ధీఘుళ్ లక్ష్మీనరసిం హాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు వివరిం చారు. సాయంత్రం స్వర్ణరథంపై స్వామివారిని వేంచేపు చేసి సేవను కొనసాగించారు. సకల రోగ నివారకుడు, ప్రకృతి చైతన్య ప్రదాత అయిన సూర్యుడి వాహనాన్ని స్వామివారు అధిరోహించి భక్తులకు కటాక్షించారు. సూర్య జయంతిని పురస్క రించుకొని స్వామివారు ఉదయం సూర్యప్రభ వాహనంపై, సాయంత్రం స్వర్ణరథంపై తిరుమాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దర్శించుకునేందుకు భక్తులు తరలివ చ్చారు. తిరుమాఢ వీధుల్లోకి చేరుకుని స్వామివా రికి మంగళహారతులు పలికారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చ కులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వా మిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమా ర్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వెలు పలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ నిర్వహించారు. అమ్మవారికి ఊంజల్ సేవో త్సవం ఘనంగా సాగింది. పాతగుట్టలో స్వామివా రికి నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి.

పాతగుట్టలో వైభవంగా అధ్యయనోత్సవాలు

పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు రెండోరోజు వైభవంగా జరి గాయి. శుక్రవారం ఉదయం స్వామివారి నిత్యారా ధనల అనంతరం తిరుమంజన మహోత్సవం పాంచరాత్రగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ప్రబంధ పాశురాలను పఠిస్తూ పురప్పాట్ సేవను నిర్వహించారు. స్వామివారి సేవను ఆలయంలో బాజాభజంత్రీలతో ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక రుత్వికులు, పండి తులు సేవల ఎదుట శాస్త్రోక్తంగా పాశురాలను పఠిం చారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం దివ్య ప్రబంధాన్ని పారాయణికులు పఠిస్తూ పుర ప్పాట్ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ వేడు కల్లో ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బాల భాస్కర్ శర్మ, ఆలయ అధికారులు రమేశ్‌బాబు, శ్రవణ్‌కుమార్, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జననేత జన్మదిన వేడుకకు సన్నద్ధం

నేడు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహణకు ప్రణాళికలు
- పలుచోట్ల రక్తదానం, అన్నదానాలకు ఏర్పాట్లు
- నియోజకవర్గాల వారీగా సేవా కార్యక్రమాలు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ సారథి, స్వరాష్ట్ర సాధకుడు, అభివృద్ధి కాముకుడు బీఆర్ఎస్ అధి నేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను నేడు ఘనంగా నిర్వహించేం దుకు సర్వం సిద్ధంమైంది. శనివారం కేసీఆర్ 70వ పుట్టిన రోజును ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమా నులు, వివిధ వర్గాల ప్రజలు ఏర్పాట్లల్లో నిమగ్న మయ్యారు. నియోజకవర్గాల వారీగా వేడుకలను మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పెద్ద ఎత్తున చేపట్టా లని భావిస్తున్నారు. పార్టీ శ్రేణులతోపాటు అభిమా నులు, వివిధ వర్గాల ప్రజలు, సంఘాల ఆధ్వర్యం లోనూ పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు కార్యా చరణ సిద్ధం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎక్కడికక్కడే కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. వీలైన చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వ హించనున్నారు. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లోనూ అన్నదానం, ఇతర వస్తువులను పంపిణీ చేయను న్నారు. వీటితోపాటు ప్రభు త్వ ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీకి సిద్ధమవుతున్నారు. ఈ నెల 13న నల్లగొండలో జరిగిన కేసీఆర్ బహిరంగ సభ స్ఫూర్తితో అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా పలు కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు అయ్యేందుకు పార్టీ శ్రేణులంతా ఉత్సాహంతో కనిపి స్తున్నారు. ఇదే సందర్భంగా కేసీఆర్‌కు అత్యంత ఇష్ట మైన హరితహారంలో భాగంగా పలుచోట్ల మొక్కలు నాటేందుకు కూడా సన్నద్ధమవుతున్నారు. అధినేత కేసీఆర్ బర్త్‌డే వేడుకల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపుని చ్చారు.

సీఎంగా ఉమ్మడి జిల్లాను గత పదేండ్లు అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్‌కు ఆయన పుట్టిన రోజు సందర్భంగా వివిధ సేవా కార్య క్రమాల్లో భాగస్వాములై కృతజ్ఞత చాటాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా, దేవరకొండ పట్ట ణంలో కేక్ కట్ చేయడంతో పాటు పండ్లు పంపిణీ చేయాలని, సామాజిక సేవా కార్య క్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు.

20న నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

నల్లగొండ, ఫిబ్రవరి 16 : జాతీయ యువజన పార్లమెంట్ ఉత్సవాల్లో భాగంగా ఉపన్యాస పోటీ లను ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రవీణ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్ర స్థాయికి, అనంతరం జాతీయ స్థాయి పోటీ లకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే అభ్యర్థులు ఫిబ్రవరి-1, 2024 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలని తెలిపారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ పోటీ లను ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ఆన్ లైన్ ద్వారా నిర్వహిస్తారని పేర్కొన్నారు. హిందీ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ఒకటి ఎంచుకోవచ్చని, న్యాయ నిర్ణేతలు ప్రతి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీకి ఇద్దరిని ఎంపిక చేస్తారని, నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం లేదా 9052798602 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఉపన్యాస అంశాలు

1. భారత్‌ను ప్రపంచ స్థాయి నాయకత్వ దేశంగా నిలబెట్టడంలో యువత పాత్ర మరియు మన దేశ ఆర్థిక స్థితిగతులలో రావాల్సిన మార్పులు
2. ఆత్మ నిర్భర్ భారత్ నుంచి వికసిత్ భారత్ వైపు మన దేశ ప్రయాణంలో యువత పాత్ర
3. ఈ దేశ యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతూ స్వయం శక్తి కేంద్రా లుగా నిలపడంలో యువత పాత్ర

ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ హరిచందన

ఈవీఎంల తనిఖీ

నల్లగొండ, ఫిబ్రవరి 16 : రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాములో నిర్వహిస్తున్న ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీని కలెక్టర్ హరిచందన దాసరి శుక్రవా రం తనిఖీ చేశారు. ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్న ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ నేపథ్యం లో కలె క్టర్ పర్యవేక్షణలో 20 మంది ఈసీఐఎల్ ఇంజినీ రింగ్ అధికారులు, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీని వాస్ ఆధ్వర్యంలో ఈ తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమ క్షంలో శుక్రవారం 5 శాతం ఈవీఎంల మాక్ పోలింగ్ సైతం నిర్వహించారు. జిల్లాలో 4,222 బ్యాలెట్ యూనిట్లు, 2,296 కంట్రోల్ యూనిట్లు, 2,784 వీవీ ప్యాట్లు ఉండగా వీటన్నింటికీ మొదటి స్థాయి తనిఖీ చేశారు.

ఇందులో 4,072 బ్యాలెట్ యూనిట్లు, 2,291 కంట్రోల్ యూనిట్లు, 2,779 వీవీ ప్యాట్లు ఎన్నికల నిర్వహణకు ఉన్నాయని, మిగిలినవి ఈసీఐఎల్‌కు పంపించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్.అశోక్, బీఆ ర్ఎస్ నుంచి బి పిచ్చయ్య, సీపీఐ(ఎం) పి. నర్సి రెడ్డి, బీఎస్‌పీ కె. కాన్షిరామ్, ఎస్‌కే చాంద్ పాషా, బీజేపీ పి. లింగస్వామి, టీడీపీ నుంచి మల్లికార్జున్ పాల్గొన్నారు.

కేసీఆర్, నాది అన్నదమ్ముల అనుబంధం

- ఉద్యమకాలం నుంచి మాకు సాన్నిహిత్యం
- ప్రజానేతకు పుట్టిన రోజు శుభాకాంక్షలు : బోర్ల రాంరెడ్డి

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 16: కేసీఆర్‌ది తనది అన్నదమ్ముల అను బంధం అని, ఉద్యమ సమయంలో అనేకసార్లు ఆయన వెంట పాదయా త్రలో పాల్గొన్నానని నల్ల గొండ మండలం ముషం పల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి రాంరెడ్డి (బోర్ల రాంరెడ్డి) తెలిపారు. ఉద్యమం నాటి అనుభ వాలను ఆయన పంచుకొ న్నారు. నా వ్యవసాయ భూమిలో భూగర్భజలాలు అడుగంట డంతో బత్తాయి తోట ఎండిపోయింది. 100కు పైగా బోర్లు వేసినా చుక్క నీరు పడ లేదు. దాంతో దాదాపుగా పది కిలోమీటర్ల దాకా పైపులైన్ వేశా. ఈ విషయాన్ని అప్పట్లో పలు హిందీ పత్రికలు ప్రచురిం చాయి. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కేసీఆర్ ఢిల్లీలో కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు నా గురించి తెలుసుకొని పిలిపించుకొన్నారు. నాపై డాక్యుమెంటరీ తీయించి అప్పటి నుంచి ప్రతి సమావేశం, సభల్లో నీళ్ల విష యంలో తెలంగాణకు అన్యాయం జరుగు తున్నదని వివరించారు. ఉద్యమ సమ యంలో పదులసార్లు పాదయాత్రలో కేసీ ఆర్ వెంట పాల్గొన్నా. అప్పటి నుంచి అనేక సందర్భాల్లో ఫోన్లు చేయడం, అన్న ఎలా ఉన్నావు? అంటూ సంబోధించే వారు. మా ఊరు చెరువుకు లిఫ్ట్ కోసం సీఎం అయిన తొలి నాళ్లలోనే కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తే ఆయనే స్వయంగా ఇంట్లోకి తీసుకెళ్లారు. నాతో కలిసి భోజనం చేశారు. నల్లగొండలో నా కొడుకు కృష్ణారెడ్డి, సాహితీల వివాహానికి హాజరయ్యారు. సీఎం అయిన నాటి నుంచి ఆరుసార్లు కలిశా. తెలంగాణ రాష్ట్రం తేవడం ఒక ఎత్త యితే.. ఆయనే మనకు సీఎంగా 10 ఏండ్లపాటు పనిచేసి రైతులతోపాటు అన్ని వర్గాలకు అండగా ఉన్నారు. రైతు బంధు, రైతు బీమా, రైతుల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టేప్పుడే ఫోన్‌చేసి రైతుల కోసం గిట్లా గీ పథకాలు తెస్తున్నా ఎలా ఉంటుంది నన్ను అడిగారు. రైతులకు కావాల్సింది నీళ్లు, కరెంట్ ఈ రెండు కేసీఆర్ అందజేశారు. రైతులకు ఇంతకన్నా ఎక్కువ మంచి చేసే వారు రాలేరు. ఆయన జన్మదినం రైతులకు ఓ పండుగే. ఆయన చేసిన పాలన రైతుల యాదిలోంచి పోలే.. ఆయన ఆయురారా గ్యాలతో ఉండి రైతులకు అండగా నిలువా లని మా ఆకాంక్ష.

కిక్కిరిసిన చెర్వుగట్టు

- రామలింగేశ్వరుడి కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

శుక్రవారం రాత్రి చెర్వుగట్టుపై భక్తజనం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 16 : మండలం లోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగే శ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్స వాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ మహా మండపంలో వేద పండి తులు గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, పంచజన్య, పూజాప్రోక్షణ, అఖండ స్థాపన, త్రిశూ ల పూజ, సూర్య నమస్కార పూజలు చేశారు. అగ్ని ప్రతిష్ఠ సృష్టికర్త బ్రహ్మ ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించే బ్రహ్మో త్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వా నిస్తూ ధ్వజారోహణం నిర్వహించారు. జాతర ప్రారంభోత్సవంలో ఆర్డీఓ రవి, డీఎస్‌పీ శివరాం రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వే ముల వీరేశం సతీమణి పుష్ప పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి నుంచే భక్తులు గుట్టపైకి చేరుకుంటు న్నారు. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రభుత్వం తర పున తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకురా నున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాట్లను ఎస్పీ చందన దీప్తి పరిశీలిం చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధి కారులకు సూచించారు. ఆమె వెంట డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

18 వరకు ప్రత్యేక బస్సులు

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 16 : చెర్వు గట్టు జాతర సందర్భంగా ఈ నెల 18 వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్‌టీసీ నల్లగొండ ఆర్ఎం శ్రీదేవి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతరకు వెళ్లే భక్తుల కోసం ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు నడుపనున్నట్లు, హైదరాబాద్, భువనగిరి వైపు వెళ్లే ప్రతి ఆర్డినరీ బస్సు చెర్వుగట్టు మీదుగా వెళ్లనున్నట్లు పేర్కొ న్నారు.

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల ప్రారంభ పూజల్లో పాల్గొన్న ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాం రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప తదితరులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టీఎన్జీఓస్ ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట టీఎన్జీఓస్ ధర్నా

నల్లగొండ, ఫిబ్రవరి 16 : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులందరికీ ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఆదాయ పన్ను పరిమితిని రూ.10 లక్ష లకు పెంచాలని టీఎన్జీఓస్ నాయకులు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టేట్ గవ ర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు మేరకు టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదు రుగా శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా టీఎన్జీఓస్ అధ్యక్షుడు నాగిళ్ల మురళి మాట్లా డుతూ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, అన్ని కార్యాలయాల్లో కేడర్ స్ట్రెంత్‌ను పెంచి డీఏలను విడుదల చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి జె.శేఖర్ రెడ్డి, నాన్ గెజిటెడ్ సహకార శాఖ అధ్యక్షుడు పంగూరి విజయ్ కృష్ణ, చేపూరి నరసింహ చారి, ఆకునూరి లక్ష్మయ్య, పాల్వాయి గామయ్య, పి.వెంకట్ రెడ్డి, మధుసూదనా చారి, కత్తుల మనోజ్ ప్రదీప్, వి. భాస్కర్, కె.దశరథ, డీఐ రాజు, డి. యాదయ్య పాల్గొన్నారు.

నల్లగొండ డీఆర్ఓగా రాజ్యలక్ష్మి

నల్లగొండ, ఫిబ్రవరి 16 : నల్లగొండ జిల్లా రెవెన్యూ అధికారిగా రాజ్యలక్ష్మి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా నటరాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్ర వారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్ నగర్ లోని భీమా ప్రాజెక్టు భూ సేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఎన్.నటరాజ్‌ను నల్ల గొండ ఐ అండ్ క్యాడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించగా.. హైద్రాబాద్ మెట్రో రైల్ భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా చేస్తున్న డి. రాజ్యల క్ష్మిని జిల్లా రెవెన్యూ అధికారిగా నియమించింది. అదే విధంగా యాదాద్రి భువనగిరి డీఆర్ఓగా పని చేస్తున్న పద్మజారాణిని సంగారెడ్డి డీఆర్ఓగా నియమించింది.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌గా సుధీర్‌రెడ్డి

తిరుమలగిరి, ఫిబ్రవరి 16 : తిరుమలగిరి మండ ల కేంద్రానికి చెందిన సంకె పల్లి సుధీర్‌రెడ్డిని తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నియమించారు. ఈయన ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. ఈయన ఎంపిక పట్ల జిల్లాలో పలువురు అభినందనలు తెలిపారు.

సూర్యాపేటలో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు

కేంద్రంపై నిరసన వెల్లువ

గ్రామీణ భారత్ బంద్ చేపట్టిన కార్మికులు, కర్షకులు

ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకో

నల్లగొండ, ఫిబ్రవరి 16 : కార్మికులు, కర్షకు లపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానా లను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా వర్గాలు నిరసన గళం విప్పాయి. కేంద్ర కార్మిక సంఘాల ఆదేశాలతో ఉద్యోగ వర్గాలతోపాటు కార్మికులు, రైతులు ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేశారు. పెద్ద ఎత్తున ర్యాలీలు తీస్తూ కేంద్ర సర్కారు వ్యతి రేకంగా నినాదాలు చేశారు. బీఆర్‌టీయూతో పాటు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీ యూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాలు ఈ నిరసనలో పాల్గొన్నాయి. ఆశ వర్కర్లు, హమాలీలు, ఇతర కార్మికులు ఇందులో భాగస్వామ్యమయ్యారు.

ఫోర్జరీ దందా

స్థలాలను రిజిస్ట్రేషన్ చేయిస్తామని నమ్మించి మోసం

- ఫేక్ నివాస ధ్రువీకరణ పత్రాలు క్రియేట్
- రబ్బర్ స్టాంపులు సృష్టించి దొంగ సంతకాలు
- గ్రామ కార్యదర్శి ఆఫీసులోని రసీదులు మాయం
- సామాన్య జనం నుంచి రూ. లక్షలు వసూలు
- నారాయణపురంలో పోలీస్ స్టేషన్‌లో ముగ్గురిపై కేసు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా దాటక ముందే ఆ పార్టీ నేతలు ఆగడాలు షురూ అయ్యాయి. అధికార పార్టీ నేతలం మమ్మల్నేం చేస్తారులే అనుకున్నారో ఏమో దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఏకంగా వేరొకరి పేరుపై ఉన్న భూములకు వ్యతిరేకంగా సర్టిఫికెట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొం దించారు. సామాన్య జనం నుంచి రూ. లక్షలు వసూలు చేశారు. నివాస ధ్రువీకరణ పత్రాలు, రబ్బరు స్టాంపులు ఫేక్ క్రియేట్ చేయడంతోపాటు ఇంటి పన్ను రసీదులను మాయం చేశారు. గ్రామ కార్యదర్శి సంతకం ఫోర్జరీకి పాల్పడ్డారు. విషయం బయటకు పొక్కడంతో నారాయణపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ)/సంస్థాన్ నారాయణపురం

నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఏపూరి శివయ్య కుటుంబ సభ్యులకు సంబంధించి వివాదం ఉన్నది. వార్డు నంబర్ 14లో గల 13-33లో తన భూమి ఉందని, తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని గ్రామ కార్యదర్శి నరేశ్‌కు అర్జీ పెట్టుకున్నాడు. అందుకు సంబంధించి డాక్యుమెంట్లు లేవని, ఆ స్థలం వేరే పేరు మీద ఉండటంతో సెక్రటరీ తిరస్కరించాడు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి గ్రామ ఉప సర్పంచ్, కాంగ్రెస్ నేత ఉప్పరగోని సంజీవ.. శివయ్యను సంప్ర దించారు. రిజిస్ట్రేషన్ చేయిస్తానని కొంత డబ్బు ఖర్చు అవుతుందని నమ్మక బలికాడు. దాంతో శివయ్య.. సంజీవకు భారీ మొత్తంలో డబ్బుతోపాటు పాస్ ఫొటోలు అప్పగించాడు. మూడు రోజుల తర్వాత ఇంటి పన్ను రసీదు, నివాస ధ్రువీకరణ పత్రాన్ని శివయ్యకు సంజీవ తెచ్చి ఇచ్చాడు.

దొంగ పత్రాలు సృష్టి..

దొంగ పత్రాల తయారీలో సంజీవతోపాటు చౌటుప్పల్‌లో రిజిస్ట్రేషన్ ఆఫీసు ఆవరణలో పనిచేసే ఏజెంట్ సందీప్ కీల కంగా వ్యవహరించారు. మొద టగా సెక్రటరీ ఆఫీసులోని ఇంటి పన్ను రసీదులను చించుకెళ్లారు. సీరియల్ నంబర్ 1796 నుంచి 1800 వరకు రసీదులను మాయం చేశారు. అందులోని ఓ రసీదు సంజీవ దగ్గర దొరికింది. ఇదిలా ఉండగా అచ్చంగా సెక్ర టరీ ఇచ్చినట్లు ఇంటి నివాస ధ్రువీకరణ పత్రం క్రియేట్ చేశారు. దీనిపై సెక్రటరీ సంతకం, రబ్బర్ స్టాంప్ వేశారు.

శివయ్య పేరుతో రూపొందించిన ఫేక్ నివాస ధ్రువీకరణ పత్రం

ఇందుకోసం ప్రత్యేకంగా రబ్బర్ స్టాంప్‌లను తయారు చేయించారు.

బయటపడిందిలా..

స్థలం రిజిస్ట్రేషన్ కోసం పత్రాలు తీసుకొచ్చి రిజిస్ట్రే షన్ కోసం చౌటుప్పల్ వెళ్లా లని శివయ్యకు సంజీవ సూచించాడు. అక్కడ సందీ ప్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకు న్నాడు. ఇక్కడే రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులకు పలు అనుమానాలు వ్యక్తమ య్యాయి. 1800 నంబర్ గల రసీదు పింక్ కలర్‌లో ఉంది. ఇది గ్రామ రికార్డుల్లో ఉండాలి. పన్ను చెల్లించిన వారికి తెల్ల కలర్ గల డూప్లి కేట్ రసీదును ఇస్తారు. అంతేకాకుండా రౌండ్ సీల్‌పై జిల్లా పేరు యాదాద్రి భువనగిరి అని ఉండకుండా.. నల్లగొండ ముద్రించారు. సెక్రటరీ నరేశ్ సంతకం కాకుండా వేరే విధంగా ఉంది. దాంతో రిజిస్ట్రార్ ఆఫీసు అధికారులు సెక్రటరీకి సమాచారం అందించడంతో అసలు విషయం బయటపడింది. కాగా రిజిస్ట్రార్ ఆఫీ సుకు తాజాగా ఇదే తరహాలో మరో దరఖాస్తు వచ్చి నట్లు తెలిసింది. దీనిపై కూడా విచారణ చేస్తున్నట్లు చెబు తున్నారు.

సామాన్యుల నుంచి రూ. లక్షలు వసూలు!

దొంగ పత్రాలు సృష్టించి ఆయా స్థలాలపై రిజిస్ట్రేషన్ చేయిస్తామని సామాన్య జనం నుంచి సంజీవ లక్షల్లో డబ్బులు వసూలు చేశారని తెలుస్తున్నది. ఇలా ఐదు నుంచి పది మంది వరకు బాధితులు ఉన్నట్లు సమా చారం. శివయ్య, సంజీవ, సందీప్‌పై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.